సాక్షి
నాగర్‌కర్నూల్

బుధవారం ၊ 16 ၊ ఏప్రిల్ ၊ 2025



రైతన్న క'న్నీటి' వ్యథ

జిల్లాలో వరిపంట సాగు చేసిన రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి.

వివరాలు 8లో ▸



వెంటిలేషన్ పునరుద్ధరణ

ఎస్‌ఎల్‌బీసీలో ఆక్సిజన్ అందించేందుకు వెంటిలేషన్ పునరుద్ధరణ కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.5 /19.9

వాతావరణం

ఉదయం, సాయంత్రం ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సదరం శిబిరాలను వినియోగించుకోండి

నాగర్‌కర్నూల్ క్రైం/ కందనూలు: దివ్యాంగులు సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ చిన్న ఓబులేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం యూడీఐడీ పోర్టల్‌లో నేరుగా, మీసేవలో దరఖాస్తు చేసుకుని రశీదుతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్ కాపీలను తీసుకుని కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఓ కార్యాలయం రూం నంబర్ ఎఫ్1లో స్లాట్ పొందాలని నమోదు చేసుకోవాలన్నారు. సదరం శిబిరాలను ఈ నెల 17 నుంచి 28 వరకు జనరల్ ఆస్పత్రిలో నిర్వహిస్తామన్నారు. శారీరక దివ్యాంగులు ఈ నెల 23, 28, వినికిడి లోపం ఉన్నవారికి 22న, కంటిచూపు లోపం ఉన్నవారికి 17, 25, మానసిక దివ్యాంగులకు 24న ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు.

20న జిల్లా సదస్సు

నాగర్‌కర్నూల్ రూరల్: ఈ నెల 20న ఏఐటీయూసీ, సీఐటీయూ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, కార్యదర్శి శివశంకర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సంయుక్త సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు లక్ష్మీపతి, వెంకటస్వామి, బాలమురళికృష్ణ, సురేష్, సుభాష్, సత్యం, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

చారకొండ: మండలంలోని అపర భద్రాది సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి హుండీ లెక్కింపు బుధవారం చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 11 వరకు జరిగిన బ్రహ్మోత్సవాలకు భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని హుండీలో వేసిన కానుకలను ఆలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ, తహసీల్దార్ సునీత, ఎస్‌ఐ శంషొద్దీన్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు లెక్కించనున్నట్లు వివరించారు.

రైతు కమిషన్ చైర్మన్ రాక

వంగూరు: మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి బుధవారం రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితోపాటు కమిటీ సభ్యులు రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఉదయం 9 గంటలకు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం 10 గంటలకు పోలకంపల్లిలోని రైతువేదికలో రైతులతో సమావేశం కానున్నారు. కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు తెలిపారు.

నల్లమల ప్రాణవాయువుతో సమానం



మన్ననూర్: నల్లమల ప్రాంతం నాకు ప్రాణవాయువుతో సమానం అని, ఇక్కడి ప్రజల ప్రేమానురాగాలు నాకు ఎంతగానో ప్రేరణ కలిగిస్తాయని వాగ్గేయకారుడు, ప్రజా గాయకుడు, కాళోజీ పురస్కారం గ్రహీత జయరాజ్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పదరలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నల్లమల ప్రాంతం అన్ని రంగాల్లో పూర్తిగా వెనకబాటుకు గురైందని, అయినప్పటికీ ఇక్కడి ప్రజల్లో రాష్ట్రం నలుమూల గుర్తుండిపోయేంత మంచితనం ఉందని, అందుకే నాకు ఈ ప్రాంతం అన్నా.. ఇక్కడి ప్రజలు అన్నా ఎంతో ఇష్టం అన్నారు. దళిత బహుజనులు అంబేడ్కర్ మార్గంలో పయనిస్తూ.. ఆయన ఆశయ సాధన కోసం ముందుకు సాగాలన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని తీసేసి తిరిగి రాచరికాన్ని తీసుకువచ్చే కుట్ర జరుగుతుందన్నారు. అంబేడ్కర్ వారసులమైన మనం అగ్రకుల భావజాలాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో చదువుకు ఉన్న విలువ మరొక దానికి లేదని గమనించి తమ పిల్లలు ఉన్నత చదువుల్లో రాణించేలా ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా ప్రొఫెసర్ గడుదాస్ వెంకటేశ్వర్లు, కళాకారుడు జక్కా గోపాల్, నాయకులు సత్యనారాయణ, రామలింగం, చిన్న చంద్రయ్య, వెంకటయ్య, ప్రవీణ్ కుమార్, రాయుడు, బాలింగం, బాలా కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు పనుల్లో కదలిక


సాక్షి, నాగర్‌కర్నూల్

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులను విడతల వారీగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటగా నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు, ఏదుల నుంచి వట్టెం, మరో వైపు ఏదుల నుంచి కర్వెన వరకు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి, వచ్చే డిసెంబర్ చివరికి నీటి సరఫరాకు సిద్ధంగా ఉంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఇటీవల నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాల్వ పెండింగ్ పనులకోసం రూ.780.63 కోట్లను విడుదల చేసింది. దీంతో ఈ ప్రాజెక్ట్ కింద సుమారు రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్న పనుల్లో కదలిక రానుంది.

- నార్లాపూర్– ఏదుల ప్రధాన కాల్వ పెండింగ్ పనులకు రూ.780.63 కోట్లు మంజూరు
- డిసెంబర్ నాటికి కర్వెన రిజర్వాయర్ వరకు పనులు పూర్తిచేసేలా కార్యచరణ
- విడతల వారీగా పనులను పూర్తిచేయనున్న ప్రభుత్వం



ఏదుల రిజర్వాయర్



నార్లాపూర్ పంపుహౌజ్ వద్ద డెలివరీ సిస్టర్న్

ప్రధాన కాల్వ నిర్మాణ పనులకు నిధులు..

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్ మధ్యలో ప్రధాన కాల్వకు 1.725 కి.మీ. పాయింట్ నుంచి 2.125 పాయింట్ కాల్వ తవ్వకం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 6.325 కి.మీ. పాయింట్ నుంచి 6.650 కి.మీ. పాయింట్ నడుమ కాల్వ నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంది. ప్యాకేజీ 3 పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.780.63 కోట్లు కేటాయించింది. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్ మధ్య పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ కెనాల్, ఓపెన్ కెనాల్ నిర్మాణంతో పాటు హెడ్ రెగ్యులేటరీ ఏర్పాటు కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. కుడికిళ్ల సమీపంలో ప్రధాన కాల్వ నిర్మాణం పూర్తిగా ఆగిపోయాయి. అక్కడ హార్డ్ రాక్‌తో కాల్వ తవ్వకాలకు ఇబ్బందిగా ఉందని చెబుతుండగా, తాజాగా ప్రభుత్వం అంచనాలను సవరించి నిధులను విడుదల చేసింది. గతంలో ఈ ప్యాకేజీ కింద పనులకు రూ.416.10 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం ఈ పనుల విలువను రూ.780.63 కోట్లకు చేరింది.

కర్వెన వరకు నీళ్లందించేలా ప్రణాళిక..

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో సాగు, తాగు నీటిని అందించేందుకు 2015లో రూ.35,200 కోట్ల అంచనాలతో పనులు చేపట్టారు. నార్లాపూర్ నుంచి ఏదుల, ఏదుల నుంచి వట్టెం, మరో వైపు ఏదుల నుంచి కర్వెన, అక్కడి నుంచి ఉద్దండాపూర్ రిజర్వాయర్ వరకు పనులు పూర్తిచేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు నార్లాపూర్, ఏదుల, కర్వెన, వట్టెం రిజర్వాయర్ల పనులు దాదాపుగా పూర్తి కాగా, పంపుహౌస్‌ల్లో మోటార్ల బిగింపు పనులు కొనసాగుతున్నాయి. మొదటి దశలో కర్వెన వరకు పనులను పూర్తి చేసే ఈ ఏడాది చివరికల్లా నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నార్లాపూర్ పంపుహౌస్‌లో మొత్తం 9 మోటార్లకు గానూ నాలుగు మోటార్లను బిగించారు. ఏదుల వద్ద పది మోటార్లకు గానూ ఐదు, వట్టెం వద్ద పది మోటార్లకు గానూ ఐదు మోటార్ల బిగింపు పనులు సాగుతున్నాయి. నార్లాపూర్ నుంచి ఏదుల మధ్య మిగిలి ఉన్న ప్రధాన కాల్వ నిర్మాణం పూర్తయ్యాక ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్లను నీటితో నింపనున్నారు.

డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా..

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న కాల్వ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.780 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం నార్లాపూర్, ఏదుల, వట్టెం పంపుహౌజ్‌ల్లో మోటార్ల బిగింపు ప్రక్రియ చేపడుతున్నాం. పెండింగ్‌లో ఉన్న ప్రధాన కాల్వ పనులను పూర్తి చేసే వచ్చే డిసెంబర్ చివరి నాటికి కర్వెన వరకు నీటిని అందించే లక్ష్యంగా పనులు చేస్తున్నాం.

– విజయ్‌భాస్కర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సీఈ

మహిళల చేతికి ప్రగతి చక్రాలు

- మండల సమాఖ్యలకు ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతలు
- ఉమ్మడి జిల్లాలో 49 బస్సుల కోసం ప్రతిపాదనలు
- ప్రతినెలా ఒక్కో బస్సుకు అద్దె రూపంలో రూ.77,220 చెల్లింపు
- మహిళలూ ఆర్థిక పరిపుష్టి సాధించే సదావకాశం
- ఇందిరా మహిళా శక్తి ద్వారా ప్రభుత్వం చేయూత



అచ్చంపేట: మహిళల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. ఇందిరా మహిళా శక్తి ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేస్తూ కోటీశ్వరులు చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఈ నేపథ్యంలోనే మహిళా సమాఖ్యలకు జిల్లాల పరిధిలో ఆర్టీసీ బస్సుల నిర్వహణ బాధ్యతను అప్పగిస్తోంది. ఇందుకోసం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో బస్సుల ఆవశ్యకతను దృష్టిలో మొత్తం ఉంచుకుని 10 డిపోల పరిధిలో అచ్చంపేట 5, కల్వకుర్తి 4, నాగర్‌కర్నూల్ 2, కొల్లాపూర్ 2, గద్వాల 4, వనపర్తి 7, మహబూబ్‌నగర్ 5, నారాయణపేట 2, కోస్గి 1, షాద్‌నగర్ 17 చొప్పున 49 బస్సుల కోసం ప్రతిపాదనలు పంపించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో నూతన సంఘాల ఏర్పాటుతో పాటు ఇది వరకు ఉన్న సంఘాలకు బస్సుల నిర్వహణకు అవసరమయ్యే రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా అందించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి ద్వారా క్యాంటీన్ల ఏర్పాటు, పెరటి కోళ్ల పెంపకం, మీ– సేవ కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఆహార కేంద్రాలు తదితర వాటి ఏర్పాటుకు సహకారం అందిస్తోంది.

అద్దె ప్రాతిపదికన

రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో విపరీతమైన రద్దీ పెరిగింది. ఉమ్మడి జిల్లాలోని డిపోల పరిధిలో సరిపడా బస్సులు లేవు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో బస్సుల కొనుగోలుతో కొంత వరకైనా సమస్య తీరనుంది. ఈ క్రమంలో మహిళా సమాఖ్యలు బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నారు. దీంతో మండల మహిళా సమాఖ్యలు పెట్టుబడి పెట్టిన మొత్తానికి ఆర్టీసీ సంస్థ ఏడేళ్లపాటు ప్రతి నెలా రూ.77,220 అద్దె చెల్లించనుంది. దీంతో మహిళా సంఘాల మహిళలకు ఆర్థిక ఊతం లభిస్తుంది. మరోవైపు రూ.లక్షల విలువైన బస్సు సమాఖ్య సొంతం కానుంది.

రద్దీ నేపథ్యంలో 64 కొత్త బస్సుల కోసం..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేశాక అన్ని డిపోల్లో బస్సుల కొరత తీవ్రమైంది. రద్దీతో డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీకి సరిపడా బస్సులు లేక ఉన్న వాటినే పంపిస్తున్నారు. ఇవి చాలా ఏళ్ల కిందటివి కావడంతో తరుచుగా మరమ్మతుకు గురవుతున్నాయి. పండుగలు, జాతర్లు, ముఖ్యమైన రోజుల్లో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. బస్‌భవన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో బస్సుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని 10 డిపోల పరిధిలో అచ్చంపేటకు (2 ఎక్స్‌ప్రెస్‌లు), కల్వకుర్తికి (2 ఎక్స్‌ప్రెస్‌లు) నాగర్‌కర్నూల్‌కు (3 పల్లె వెలుగులు), గద్వాలకు (7 ఎక్స్‌ప్రెస్‌లు, 12 పల్లె వెలుగులు, 2 డీలక్స్‌లు), వనపర్తికి (4 ఎక్స్‌ప్రెస్‌లు, 4 పల్లె వెలుగులు), మహబూబ్‌నగర్‌కు (11 ఎక్స్‌ప్రెస్‌లు, 6 పల్లె వెలుగులు), నారాయణపేటకు (1 ఎక్స్‌ప్రెస్, 1 పల్లెవెలుగు), షాద్‌నగర్‌కు (6 ఎక్స్‌ప్రెస్‌లు, 3 పల్లె వెలుగులు) చొప్పున మొత్తం 64 బస్సుల కోసం అధికారులు ప్రత్యేకంగా ప్రతిపాదనలు పంపించారు. త్వరలోనే ఈ కొత్త బస్సులు ఆయా డిపోలకు చేరనున్నాయి.

కొల్లాపూర్- నాగర్‌కర్నూల్ మధ్య..



మాకు కేటాయించిన బస్సును మార్చి 20 నుంచి కొల్లాపూర్– నాగర్‌కర్నూల్ మధ్య నడిపిస్తున్నాం. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.30 లక్షలతో ఎలక్ట్రికల్ బస్సు కొనుగోలు చేసి అప్పగించింది. ఆర్టీసీ వారు నెలకు రూ.77,220 అద్దె చెల్లిస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి డబ్బులు చెల్లించలేదు. పెద్దకొత్తపల్లి మండల మహిళా సమాఖ్య జిల్లాలోనే ఉత్తమ మహిళా సమాఖ్యగా ఎంపికైంది.

– అరుణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పెద్దకొత్తపల్లి

జిల్లాకు ఏడు బస్సులు..

నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాలకు గాను ఏడింటికి మొదటి విడతలో ఏడు బస్సులు మంజూరయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా పెద్దకొత్తపల్లికి చెందిన సమాఖ్య బస్సు ప్రారంభించడం జరిగింది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన రూ.30 లక్షల నిధులు ప్రభుత్వం నుంచి విడుదల కాగా మహిళా సంఘాల అకౌంట్‌లో జమ అయ్యాయి.

– చిన్న ఓబులేషు, డీఆర్‌డీఓ, నాగర్‌కర్నూల్



జిల్లా మహిళా సమాఖ్య సమావేశం (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో మహిళా సంఘాలు, సభ్యుల వివరాలు...

జిల్లా	మ.స.	గ్రా.స.సం	స్వ.స.మ.సం.	మొత్తం సభ్యులు
మహబూబ్‌నగర్	16	485	11,695	1,24,695
నాగర్‌కర్నూల్	20	617	13,083	1,46,916
నారాయణపేట	11	353	8,388	91,033
వనపర్తి	15	343	7,332	85,865
జోగులాంబ గద్వాల	12	311	6,720	74,665

మ.స.: మండల సమాఖ్యలు.. గ్రా.స.సం.: గ్రామ సహాయక సంఘాలు.. స్వ.స.మ.సం.: స్వయం సహాయక మహిళా సంఘాలు

వాటర్ షెడ్ యాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

నాగర్‌కర్నూల్: ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజనలో భాగంగా ఈ నెల 23న వాటర్ షెడ్ యాత్ర ఉప్పునుంతల, బీకే లక్ష్మాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ దేవసహాయం తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో వాటర్ షెడ్ యాత్రపై సంబంధిత శాఖ అధికారులతో దేవసహాయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొననున్న వాటర్ షెడ్ యాత్రకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. వాటర్ షెడ్‌లు మన నీటి వనరులు, పర్యావరణానికి కీలకమైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వహించడం చాలా ముఖ్యమని, వాటర్ షెడ్ల ప్రాముఖ్యత, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. వాటర్ షెడ్ పథకంపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూ, నీటి సంరక్షణ, గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగు కోసం ఉద్దేశించిన వ్యవసాయ సంబంధమైన పండ్ల తోటల పెంపకం, అధునాతన సాంకేతిక వ్యవసాయ పద్ధతి ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అటవీ సంరక్షణలో భాగంగా వాటర్‌షెడ్ ప్రాంతాల్లో చెట్లను నరకకుండా చూడటంతోపాటు కొత్త మొక్కలను నాటాలని, నేల కోతను నివారించడానికి సరైన వ్యవసాయ పద్ధతులు, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని, వర్షపు నీటిని సంరక్షించుకొని భవిష్యత్ తరాలకు అందించాలన్న ముఖ్య లక్ష్యంతో చేపట్టనున్న వాటర్ షెడ్ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. వాటర్ షెడ్ యాత్రలో విద్యార్థులు, యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు. పాఠశాలల్లో వాటర్ షెడ్ పథకంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని సూచించారు. వాటర్ షెడ్ యాత్రపై స్టాళ్ల ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటే కార్యక్రమం, చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ తదితర పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ చిన్న ఓబులేషు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు, ఉద్యానవన శాఖ అధికారి జగన్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో



జూరాల ప్రాజెక్టుపై రైతుల రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు

- మండుటెండలో జూరాల ప్రాజెక్టుపై బైఠాయింపు
- గంటన్నర వరకు కదలని రైతులు
- నిలిచిన వాహన రాకపోకలు

అమరచింత: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు రహదారిపై సాగునీరు ఇవ్వాలంటూ మండుటెండలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా యాసంగిలో 20 వేల ఎకరాలకు సాగునీటిని రామన్‌పాడు వరకే అందిస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో ప్రాజెక్టు సమీపంలో ఉన్న అమరచింత, ఆత్మకూరు మండలాల రైతులు వరిపంట సాగుచేశారు. వారబందితో సాగునీటిని అందించిన అధికారులు పంటలు చేతికొచ్చే సమయంలో నీటిని నిలిపివేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లి, తూంపల్లి, గుంటిపల్లి, జూరాల గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం జూరాల ఎడమ కాల్వ వద్దకు చేరుకొని ప్రాజెక్టు రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అక్కడే ఉన్న బారికేడ్లు, ముళ్లపొదలు అడ్డంగా పెట్టడంతో వాహనాల రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ ఎస్‌ఐ, వనపర్తి జిల్లా అమరచింత ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ, తమకు సాగునీరు అందించాల్సిందేనని, అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని రైతులు తెగేసి చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో రైతుల రాస్తారోకో విషయాన్ని సీఐ శివకుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వచ్చి ఉన్నతాధికారులతో చర్చించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

ముగిసిన 'పది' మూల్యాంకనం

కందనూలు: జిల్లాకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం ముగిసిందని డీఈఓ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని మూల్యాంకన కేంద్రంలో చీఫ్ ఎగ్జామినర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎలాంటి అవరోధాలు లేకుండా మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని, అత్యంత పారదర్శకంగా పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ నిర్వహించామన్నారు. 64 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 384 మంది సహాయ ఎగ్జామినర్లు, 130 మంది స్పెషల్ అసిస్టెంట్స్ విధులకు హాజరై 1,34,503 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారన్నారు. మూల్యాంకనం చివరిరోజు రెగ్యులర్ విద్యార్థుల పరీక్ష పేపర్లు తెలుగు 20,482, హిందీ 19,180, ఇంగ్లిష్ 11,991, గణితం 23,406, ఫిజికల్ సైన్స్ 26,100, బయోసైన్స్ 14,088, సోషల్ స్టడీస్ 17,616, ఒకేషనల్ 1,604, తెలుగు రెండో సబ్జెక్ట్ 36 పేపర్లు మూల్యాంకనం చేసినట్లు వివరించారు. ఎలాంటి పని అప్పగించినా ఉపాధ్యాయులు అంకితభావంతో పూర్తి చేసి జిల్లా విద్యా శాఖకు పేరు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. గత మూడేళ్ల నుంచి లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలను మూల్యాంకన ప్రక్రియకు అప్పగించి సహకరించిన పాఠశాల ప్రిన్సిపల్ రాజును డీఈఓ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ కుర్మయ్య, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

నష్టపోయిన మామిడి రైతుల వివరాలు పంపండి

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో వర్షాలు, ఈదురు గాలులతో నష్టపోయిన మామిడి రైతుల వివరాలను నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడినట్లు ఎంపీ మల్లురవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి రైతులు కూడా తమకు జరిగిన నష్టం వివరాలను కలెక్టర్‌తోపాటు ఆయా మండలాల్లో తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లాలని, నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

జడ్చర్ల: 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ గుర్తుతెలియన వ్యక్తి (సుమారు 58 ఏళ్లు) రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. జమ్‌జమ్ హోటల్ ఎదుట రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని, మృతదేహాన్ని జడ్చర్ల ఆస్పత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి పడి యువకుడు..

- ఫోన్ లొకేషన్ ఆధారంగా మృతదేహం గుర్తింపు


భరత్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

అమరచింత/దేవరకద్ర రూరల్: రైలు డోర్ తగిలి కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం దేవరకద్ర సమీపంలో చోటు చేసుకుంది. అమరచింత పట్టణానికి చెందిన మరెడి సురేందర్ రెడ్డి రెండో కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి సిద్దిపేటలోని మెరిడియాం ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వరుస సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చాడు. మంగళవారం సిద్దిపేటకు వెళ్లడానికి తెల్లవారు జామున తండ్రి సురేందర్ రెడ్డితో కలిసి మదనాపురం రైల్వే స్టేషన్‌లో వెంకట్రాది ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. హైదరాబాద్‌లో రైలును క్లీన్ చేస్తున్న సిబ్బందికి బ్యాగ్ దొరకడంతో రైల్వే పోలీసులు ఐడెంటిటీ కార్డును పరిశీలించి కాలేజీ సిబ్బందికి, భరత్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో పోలీసులు భరత్‌కుమార్‌రెడ్డి ఫోన్ లొకేషన్ ఆధారంగా దర్యాప్తు చేయగా దేవరకద్ర రైల్వే ట్రాక్ సమీపంలోని పంట పొలాల్లో భరత్‌కుమార్‌రెడ్డి విగతజీవిగా పడి ఉండటాన్ని కనుగొన్నారు. చేతికందొచ్చిన కొడుకు మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. యువకుడి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఈదురు గాలులకు డబ్బా పడి మహిళా రైతు..


అయ్యమ్మ (ఫైల్)

అడ్డాకుల: డబ్బా మీదపడి ఓ మహిళా రైతు ప్రాణాలు కోల్పోయిన ఘటన మూసాపేట మండలం వేములలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన అల్ల మాయపల్లి మల్లయ్య, అయ్యమ్మ (59) భార్యాభర్తలు. వీరు గ్రామ సమీపంలోని హన్మంత్‌రెడ్డి వ్యవసాయ పొలంలో వరి ధాన్యం ఆరబోశారు. మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో అయ్యమ్మ ధాన్యంపై టార్పాలిన్లు కప్పి సమీపంలో ఉన్న డబ్బా చాటున నిలబడగా గాలుల ధాటికి ఆమెపై పడింది. కాసేపటి తర్వాత తోటి రైతులు ఆమె కోసం వెదకగా డబ్బా కింద కనిపించింది. అందరూ కలిసి డబ్బాను పైకెత్తి చూడగా అప్పటికే మృతి చెందింది.


ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు వెంకటన్న. ఆత్మకూరు మండలం గుంటిపల్లి గ్రామం. జూరాల ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న డీ–6 ద్వారా సాగునీరు వస్తుందని ఐదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరిసాగు చేశారు. ఎకరానికి రూ. 25వేల చొప్పున ఖర్చుచేశారు. ప్రస్తుతం సాగునీరు నిలిచి పోవడంతో ఐదెకరాల పంట పూర్తిగా ఎండుముఖం పట్టింది. ఒక తడికైనా నీరు వస్తే ఐదెకరాల్లో కనీసం ఎకరా పంట చేతికి అందుతుందని ఆశపడుతున్నాడు.


ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు మహిమూద్. ఆత్మకూర్ మండలం జూరాల గ్రామం. ఈయన యాసంగిలో జూరాల కాల్వ కింద 12 ఎకరాల్లో వరిసాగు చేశారు.. ఎకరానికి దాదాపు రూ. 25వేల వరకు పెట్టుబడి పెట్టిన మహిమూద్.. సాగునీటి విడుదల నిలిచిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సాగునీరు అందించాలని ఇప్పటికే రెండు పర్యాయాలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటున్నారు. కాల్వ ద్వారా సాగునీరు ఇవ్వకపోతే 12 ఎకరాలు ఎండిపోతుందని వాపోతున్నారు.

రైతన్న క‘న్నీటి’ వ్యథ


అమరచింత ఎత్తిపోతల కింద పొట్టదశలో ఉన్న వరిపంట

- జూరాల ఎడమ కాల్వకు సాగునీటిని నిలిపివేసిన అధికారులు
- రైతుల కళ్లెదుటే ఎండిపోతున్న పంట
- చివరి తడికైనా సాగునీరు ఇవ్వాలంటూ వేడుకోలు

అమరచింత: జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలో యాసంగి వరిపంట సాగుచేసిన రైతులకు క‘న్నీటి’ కష్టాలు వెంటాడుతున్నాయి. ఇన్నాళ్లు వారబందీ పద్ధతిలో ఆయకట్టుకు సాగునీరు అందించిన అధికారులు.. ఇటీవల జూరాల కాల్వలకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేయడంతో వ్యయప్రయాసాలకోర్చి సాగుచేసిన పంట రైతుల కళ్లెదుటే ఎండిపోతోంది. కనీసం ఒక తడి అయినా సాగునీరు అందిస్తే కొంత మేరకైనా వరిపంట చేతికి అందుతుందని రైతన్నలు ఆందోళన బాట పట్టారు. తమకు సాగునీరు కావాలంటూ వారంరోజుల వ్యవధిలోనే రెండు పర్యాయాలు జూరాల ప్రాజెక్టు రహదారిపై రాస్తారోకో చేపట్టారు. చివరి దశలో ఉన్న పంటకు సాగునీరందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


నీరు నిలిచిన జూరాల ఎడమ కాల్వ

యాసంగి సీజన్‌లో జూరాల ఎడమ కాల్వ పరిధిలో రామన్‌పాడు వరకు 20వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ప్రాజెక్టు అధికారుల ప్రకటనతో ఉమ్మడి అమరచింత, ఆత్మకూర్ మండలాల రైతులు వరిపంట సాగుచేసుకున్నారు. ఆత్మకూర్ మండలంలోని డీ–6 కెనాల్ పరిధిలోని కాల్వ పూర్తిగా దెబ్బతినడంతో సాగునీరు దిగువన ఉన్న గ్రామాల రైతులకు సకాలంలో అందక పంటసాగు ఆలస్యమైంది. ప్రాజెక్టులో నీరు ఉండటం, వారబందీ పద్ధతిలో సాగునీరు వదులుతున్నారని గ్రహించిన రైతులు.. ఈసారి గట్టెక్కుతామని ఆశపడి వరిసాగు సాగుచేసుకున్నారు. ఎకరానికి రూ. 25వేల చొప్పున పెట్టుబడి పెట్టిన రైతులకు చివరి దశలో సాగునీరు అందక పోవడంతో వారి ఆశలన్నీ అడియాశలుగా మిగిలిపోయాయి. ఇప్పటికే జూరాల, గుంటిపల్లి, తూంపల్లి, ఆరేపల్లి, కత్తేపల్లె తదితర గ్రామాల్లో 3వేలకు పైగా ఎకరాల్లో వరిపైరు ఎండింది. తమకు కనీసం ఒక తడి అయినా సాగునీరు ఇవ్వాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులను విన్నవిస్తున్నారు.

పంట ఎండిపోతుంది..


యాసంగి పంట పూర్తి వరకు సాగునీరు వస్తుందని అప్పుచేసి పన్నెండు ఎకరాల్లో వరిసాగు చేశాను. వారబందీతో కాల్వకు సాగునీరు వదలడంతో పంట ఎండిపోయే స్థితికి చేరింది. ఇప్పుడు సాగునీటి విడుదలను పూర్తిగా నిలిపివేయడంతో పంట చేతికివచ్చే పరిస్థితి లేకుండాపోయింది. కనీసం ఒక్క తడైనా సాగునీరు ఇస్తే మూడెకరాల్లో అయినా పంట చేతికి వస్తుందనే ఆశ ఉంది. – వెంకటేశ్, రైతు, మొట్లంపల్లి, ఆత్మకూర్ మండలం

ఎమ్మెల్యే చొరవ చూపాలి..


యాసంగిలో 12 ఎకరాల్లో వరిసాగు చేసుకున్నా. చివరి తడి వరకు సాగునీరు ఇస్తామని అధికారులు అన్నారు. ఇప్పుడేమో తాగటానికి నీరు లేదని రైతులకు ఇచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో 12 ఎకరాల పంట పూర్తిగా దెబ్బతింటుంది. సాగునీటి విడుదలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చొరవ చూపాలి.

– వినోద్, రైతు, ఆరేపల్లి, ఆత్మకూర్ మండలం

అమరచింత ఎత్తిపోతల కింద ఇలా..

జూరాల ప్రధాన ఎడమ కాల్వకు అనుసందానంగా ఉన్న అమరచింత ఎత్తిపోతల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సుమారు 800 ఎకరాల్లో పంట ఎండుముఖం పట్టిందని రైతులు తెలిపారు. లిఫ్ట్ పరిధిలో సుమారు 1000 ఎకరాల్లో వరి పంటను సాగుచేస్తున్నారని.. ప్రభుత్వం చొరవ చూపి మిగిలిన పంటకు అయినా చివరి తడికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

‘ఆ టీచర్’ మాకొద్దు..


కస్తూర్బాగాంధీ పాఠశాల ఆవరణలో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

- విద్యార్థుల వ్యక్తిగత వీడియోలు తీసి లీక్ చేస్తానని బెదిరింపు
- టీచర్‌ను సస్పెండ్ చేసే వరకు భోజనం చేయం..

కందనూలు: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని నాగనూలు కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు దాదాపు నాలుగు గంటల పాటు ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. వారం రోజుల క్రితం నాగనూలు కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఓ విద్యార్థిని స్టడీ అవర్స్‌కు ఆలస్యంగా వచ్చిందని ఇంగ్లిష్ టీచర్ మూడు గంటల పాటు నిలబెట్టిన విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి విచారణ చేపట్టి టీచర్‌పై చర్యలు తీసుకుంటామని డీఈఓ రమేష్‌కుమార్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. అయితే వారం రోజులు గడుస్తున్నా ఆ ఉపాధ్యాయురాలిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మంగళవారం విద్యార్థులు పాఠశాల ప్రధాన గేటు వద్ద ఎండలో దాదాపు నాలుగు గంటల పాటు భోజనం చేయకుండా ధర్నా చేశారు. సంబంధిత టీచర్‌ను సస్పెండ్ చేసే వరకు మేము భోజనం చేయమని నినదించారు. ఆమె మళ్లీ పాఠశాలకు వస్తే ఎవ్వరం పాఠశాలలో ఉండమని విద్యార్థినులు భీష్మించారు. తను విద్యార్థినులను అసభ్య పదజాలంతో దూషించి, మానసికంగా వేధిస్తోందని, వాష్‌రూంకు వెళితే ఆ ఫొటోలు, వీడియోలు తీసి వాటిని బయట లీక్ చేస్తానని భయపెడుతుందని విద్యార్థులు వాపోయారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేసే వరకు ఇక్కడ నుంచి కదిలేదిలేదని కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న డీఈఓ రమేష్‌కుమార్ పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు నచ్చచెప్పి ఆ టీచర్‌ను ఎట్టి పరిస్థితులలో ఇక్కడ ఉంచబోమని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

బిడ్డల్లాగా చూసుకుంటారనుకుంటే...


పాఠశాలలో చదువు చెప్పే ఉపాధ్యాయులు విద్యార్థులను సొంత బిడ్డల్లాగా చూసుకుంటారని అనుకుంటే.. వీళ్లే ఈ విధంగా ప్రవర్తించడం బాగా లేదు సార్. మా పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఈ టీచర్‌ను సస్పెండ్ చేయాలి. తమ పిల్లలకు మంచి చదువు చెప్పించండి సార్.

– సత్యనారాయణ, విద్యార్థిని తండ్రి, మొలచింతపల్లి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

డిండి: జడ్చర్ల–కోదాడ హైవేపై నల్లగొండ జిల్లా డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామ స్టేజీ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన కాసుల అరవింద్‌చారి(31), చేపూరి కార్తీక్‌చారి(35) బైక్‌పై పని నిమిత్తం మంగళవారం దేవరకొండకు వచ్చారు. పని పూర్తిచేసుకుని తిరిగి కల్వకుర్తికి వెళ్తుండగా.. డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో అరవింద్‌చారి, కార్తీక్‌చారికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాజు తెలిపారు.

కొనసాగుతున్న వెంటిలేషన్ పునరుద్ధరణ

ఎస్‌ఎల్‌బీసీలో కార్మికుల జాడ కోసం 53 రోజులుగా అన్వేషణ


సొరంగం లోపల సహాయక చర్యలు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం పైకప్పు కూలిన ఘటనలో గల్లంతైన కార్మికుల ఆచూకీ మంగళవారం కూడా లభ్యం కాలేదు. సొరంగం లోపల డీ–2, డీ–1 ప్రదేశాల మధ్యన మట్టి తవ్వకాలు కొనసాగుతుండగా.. పూర్తి కావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. నిషేధిత ప్రదేశం వరకు శిథిలాల తొలగింపు కొనసాగుతుండగా.. అక్కడి వరకు ఆక్సిజన్ అందించేందుకు వెంటిలేషన్ పునరుద్ధరణ పనులు కొనసాగిస్తున్నారు. టీబీఎం శకలాలు, బండరాళ్లను లోకో ట్రైన్‌లో, మట్టి, బురదను కన్వేయర్ బెల్టుపై బయటకు తరలిస్తున్నారు. నీటి ఊటను 150 హెచ్‌పీ మోటార్ల సాయంతో కృష్ణానదిలోకి వదులుతున్నారు. చిక్కుకున్న ఆరుగురి కార్మికుల జాడ రెండు, మూడు రోజుల్లో లభించే అవకాశం ఉందని సహాయక సిబ్బంది తెలిపారు.

డీ–2 ప్రదేశంలో తవ్వకాలు..

సొరంగంలో ప్రమాద ప్రదేశం డీ–2 సమీపంలో మట్టి తవ్వకాలు వేగంగా కొనసాగుతున్నాయని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. మంగళవారం జేపీ కార్యాలయంలో ప్రత్యేక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కొనసాగుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్కవేటర్లు, బాబ్ క్యాట్లు నిర్విరామంగా మట్టి తవ్వకాలు చేపడుతూ కన్వేయర్ బెల్టు ద్వారా సొరంగం బయటకు పంపుతున్నట్లు తెలిపారు. టీబీఎం మిషన్‌పై పేరుకుపోయిన బురదను వాటర్ జెట్‌ల సాయంతో తొలగించే ప్రక్రియ సమాంతరంగా కొనసాగుతుందని చెప్పారు. సహాయక సిబ్బంది రాత్రింబవళ్లు విరామం లేకుండా పనిచేస్తున్నారని, వారికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

75 ట్రాక్టర్ల ఇసుక డంప్‌లు సీజ్


ఇసుక నిల్వలను సీజ్ చేసిన అధికారులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామ శివారులోని నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను డంపింగ్ చేయడంతో విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి, ఆర్‌ఐ రాఘవేందర్‌రావులు దాదాపు 75 ట్రాక్టర్ల ఇసుకను డంపింగ్ సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డంపింగ్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌ఐ తెలిపారు.

భార్య హత్య కేసులో భర్త రిమాండ్

ఎర్రవల్లి: భార్యను హత్య చేసిన కేసులో భర్తను రిమాండ్‌కు తరలించినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. మండలంలోని సాతర్ల గ్రామానికి చెందిన షాలు తన భార్య సంసీన్ అలియాస్ నషియాబాను (32)తో మార్చి 30న గొడవ పెట్టుకొని ఆగ్రహంతో రోకలి బండతో తలపై కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై ఆమె కోమాలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఈ నెల 4న పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె తల్లి మాసుంబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అలంపూర్ సీఐ రవిబాబు కేసు విచారణలో భాగంగా మంగళవారం షాలును అరెస్ట్ చేసి అలంపూర్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుల మృతదేహాలు లభ్యం

మహబూబ్‌నగర్ క్రైం: దివిటిపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన మహిమూద్ (24), అయ్యప్ప అలియాస్ సుశాంత్ (17) మృతదేహాలను క్వారీ గుంత నుంచి మంగళవారం సాయంత్రం అధికారులు వెలికితీశారు. విజయ్‌కుమార్ మృతదేహం సోమవారమే లభ్యం కాగా.. అయ్యప్ప, మహిమూద్ కోసం రాత్రి వరకు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం అగ్నిమాపకశాఖ, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం 5.40 ప్రాంతంలో ఇద్దరి మృతదేహాలు వేర్వేరు ప్రాంతాల్లో లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

మోతీఘనపూర్‌లో..

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్ మండలం మోతీఘనపూర్ పెద్దచెరువులో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు మృతిచెందిన విషయం విదితమే. కాగా మంగళవారం ఉదయం శివకుమార్ మృతదేహం చెరువులో నీటిపై తేలియాడుతూ కనిపించడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు. యాదయ్య మృతదేహం కోసం సాయంత్రం వరకు గాలించినా ఫలితం లేకపోయింది.

కొడుకు చేసిన పనికి తండ్రి బలి


ఘటనా స్థలంలో వీరయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

- భర్త, ఇద్దరు పిల్లలున్న మహిళతో వివాహేతర సంబంధం
- నెల రోజుల క్రితం ఏపీకి వెళ్లి సహజీవనం
- కుమారుడిపై కోపంతో... తండ్రిని వెంటాడి వేటాడి హతమార్చిన ప్రత్యర్థులు

అచ్చంపేట రూరల్: కుమారుడి వివాహేతర సంబంధానికి ఓ తండ్రి బలయ్యాడు. ప్రత్యర్థులు వెంటాడి వేటాడి దారుణంగా హతమార్చారు. ప్రశాంతంగా ఉండే నల్లమల ప్రాంతం ఈ హత్యతో ఒక్కసారిగా ఉలికిపడింది. గ్రామస్తుల వివరాల మేరకు.. అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామానికి చెందిన బూరం వీరయ్య (54) చిన్న కుమారుడు పరమేశ్ అదే గ్రామానికి చెందిన భర్త, ఇద్దరు సంతానం ఉన్న ఓ వివాహితతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో నెలరోజుల క్రితం ఆ మహిళను ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి సహజీవనం చేశారు. సదరు మహిళ భర్త, బంధువులు వారున్న ప్రాంతానికి వెళ్లి యువకుడిని చితకబాది.. మహిళను స్వగ్రామానికి తీసుకువచ్చారు. అయితే సదరు యువకుడు, అతడి కుటుంబసభ్యులపై మహిళ కుటుంబ సభ్యులు పగ పెంచుకున్నారు. ప్రతీకారం కోసం ఎదురుచూశారు. మంగళవారం వీరయ్య తన పెద్ద కుమారుడు వెంకటేశ్‌తో కలిసి అచ్చంపేట నుంచి నడింపల్లికి బైక్‌పై వస్తున్న విషయాన్ని గుర్తించారు. హైదరాబాద్–అచ్చంపేట ప్రధాన రహదారిపై నడింపల్లి సమీపంలో బైక్‌పై కొందరు వెంబడించగా.. మరికొందరు కారుతో వీరయ్య బైక్‌ను ఢీకొట్టారు. అనంతరం వారి కళ్లల్లో కారం చల్లి సుత్తి, గొడ్డలితో వీరయ్యపై విరుచుకుపడ్డారు. మెడ భాగంపై గొడ్డలితో వేటు వేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్‌పై దాడికి యత్నించగా.. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.


వీరయ్య (ఫైల్)

ప్రధాన రహదారిపై ఆందోళన..

వీరయ్య హత్య విషయం తెలుసుకున్న అతడి బంధువులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకు దిగారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్–అచ్చంపేట ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. గతంలో వీరయ్య కుటుంబంపై దాడి జరిగిన విషయంపై అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని వీరయ్య కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. నిందితులకు పోలీసుల సపోర్టు ఉందని ఆరోపిస్తూ.. ఘటనా స్థలానికి వచ్చిన ఓ కానిస్టేబుల్‌పై దాడికి యత్నించారు. గమనించిన తోటి పోలీసులు ఆర్టీసీ బస్సులో అతడిని అచ్చంపేటకు పంపించారు. ఘటనా స్థలానికి డీఎస్పీ శ్రీనివాసులు చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I Gunamoni Mallika Yadav S/o Gunamoni Saidulu Yadav R/o Kotha Ramnagar (V), Uppununthala (M), Nagarkurnool (D), Telangana (State). Have Changed My Name G. ROHINI S/o G. Saidulu Date of Birth: 26/12/2006 vide Affidavit date: 03/04/2025 P.Ram Mohan Rao Advocate and Notary, Nagarkurnool (Dist).

WANTED

ఫామ్ హౌస్‌లో పనిచేయుటకు వ్యవసాయం తెలిసిన భార్యాభర్తలు కావలెను. రూమ్ ఇవ్వబడును. కల్వకుర్తి గట్టు ఇప్పలపల్లి నెలకు జీతం 15వేలు. 7382532031

త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ:18k Ph: 9640400073, 9160900024

భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనల చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరాలివ్వాలని మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే కోరా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్



ఉద్యోగ అవకాశాలు

సాక్షి దినపత్రికకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మహబూబ్‌నగర్, గద్వాల మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలలో SR లుగా పనిచేయుటకు ఇంటర్ లేదా డిగ్రీ అర్హత కలిగి 21 సం॥ నిండిన యువకులు కావలెను.

ఇంటర్వ్యూ: 21-04-2025 సోమవారం ఉ॥ 11 గం॥ నుండి మ॥ 2 గం॥ల వరకు

అర్హత కలిగిన అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ క్రింది అడ్రస్ నందు సంప్రదించగలరు.

నోట్: ఇతర దినపత్రికలలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సాక్షి యూనిట్ కార్యాలయము: అమిస్తాపూర్ గ్రా., భూత్పూర్ మం., మహబూబ్‌నగర్ జిల్లా సెల్: 9618066349

మీలోని ప్రతిభకు చక్కటి అవకాశం

సాక్షి దినపత్రికలో సేల్స్ ప్రమోటర్లు గా పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను

- అర్హతలు : కనీసం 10వ తరగతి పాసై ఉండవలెను.
- వయస్సు : 19 నుండి 30 సం॥లోపు వారై ఉండాలి.
- జీతభత్యాలు : ఆకర్షణీయమైన జీతం + ఇన్‌సెంటివ్స్.

తప్పనిసరిగా ఆండ్రాయిడ్ ఫోన్ కలిగి ఉండవలెను.

మార్కెటింగ్ రంగంపై ఆసక్తి ఉన్నవారు బయోడేటా, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, సర్టిఫికెట్లు & ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించండి.

ఇంటర్వ్యూ తేది: 21-04-2025 సోమవారం ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 2:00 గం॥ల వరకు

ఇంటర్వ్యూ జరుగు ప్రదేశము: సాక్షి యూనిట్ కార్యాలయము అమిస్తాపూర్ గ్రా., భూత్పూర్ మం., మహబూబ్‌నగర్ జిల్లా. సెల్: 9618066349, 9948698552

SAKSHI MEDIA GROUP www.sakshi.com